సాక్షి విశాఖపట్నం

బుధవారం। 11। అక్టోబర్। 2023



ఆరోగ్య సేవలు విస్తృతం

మానసిక రోగులకు సేవలు విస్తృతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. 10లో



చిట్టితల్లులకు రక్షణ

లైంగిక వేధింపులకు ప్రభుత్వం అడ్డుకట్ట వేస్తోంది. పాఠశాలలు, కళాశాలల్లో 'భరోసా'బాక్సులు ఏర్పాటు చేశారు. 10లో



కేకే లైన్ రెడీ

కొండచరియలు విరిగిపడడంతో కేకే లైన్ దెబ్బతింది. మంగళవారం నుంచి ఈ లైన్ అందుబాటులోకి వచ్చింది. 10లో

న్యూస్‌రీల్

12,13 తేదీల్లో యువజనోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిస్టర్ షైజీ

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎక్సెల్సియార్–23 పేరిట ఈ నెల 12, 13 తేదీల్లో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో యువజనోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు ఏయూ పరిధిలోని కళాశాలల విద్యార్థులు నమోదు చేసుకోవాలని కో–ఆర్డినేటర్ డాక్టర్ సుధ కోరారు. సుమారు 3 వేల మంది విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు డాక్టర్ పి.కె.జయలక్ష్మి తెలిపారు. 13న జరిగే ముగింపు ఉత్సవాలకు సినీ నటుడు సోహెల్, యూట్యూబ్ స్టార్ షణ్ముఖ్ జశ్వంత్ హాజరవుతారని వివరించారు. కమిటీ ప్రతినిధులు డాక్టర్ హరిణి, పావని, ప్రమీలా, డాక్టర్ పవన్, డాక్టర్ అనుపమ, వీణా, డాక్టర్ హదస, సిస్టర్ జైన్, సిస్టర్ సోనీ, స్టూడెంట్ కౌన్సిల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏయూ రిజిస్ట్రార్‌కు సీఐడీ చీఫ్ అభినందన



రిజిస్ట్రార్ స్టీఫెన్‌ను అభినందిస్తున్న సీఐడీ చీఫ్ సంజయ్

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను రాష్ట్ర క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్(సీఐడీ) చీఫ్ ఎన్.సంజయ్ అభినందించారు. మంగళవారం అమరావతిలోని తన కార్యాలయంలో స్టీఫెన్‌ను సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. పరిపాలన దక్షత, ఉన్నత విద్యార్హతలు కలిగిన ఆచార్య స్టీఫెన్‌కు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏయూ పూర్వ విద్యార్థిగా తాను ఎల్లప్పుడూ విశ్వవిద్యాలయం ప్రగతిని తెలుసుకుంటున్నానని సీఐడీ చీఫ్ సంజయ్ తెలిపారు.

రిసోర్స్‌పర్సన్ మెరిట్ జాబితా విడుదల

విశాఖ విద్య: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భవిత కేంద్రాల్లో రిసోర్స్ పర్సన్‌గా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితా ప్రకటించినట్లు అదనపు కో–ఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన జాబితా ప్రకటించామన్నారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే తగిన ధ్రువపత్రాలతో ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం 2గంటల్లోగా విశాఖలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు. మెరిట్ జాబితా deovsp.net అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు.

గ్రామ స్థాయి నుంచే మహిళా సాధికారత

దొండపర్తి: గ్రామ స్థాయి నుంచే మహిళా సాధికారత సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహనరావు పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల వరకు ఉన్న 30 మంది మహిళా సర్పంచులకు 'షీ ఈజ్ ఎ ఛేంజ్ మేకర్' అనే అంశంపై నాయకత్వ నైపుణ్యాభివృద్ధి కోసం మంగళవారం కలెక్టరేట్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందడానికి ప్రతి మహిళా కృషి చేసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ పూర్ణిమాదేవి, ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఏఓ విజయలక్ష్మి, ఏఏఓ సూర్యకుమారి, శిక్షణ కోర్డినేటర్ కార్తీక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, మహిళా సర్పంచులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ క్వార్టర్లీ పరీక్షలు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ క్వార్టర్లీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని జూనియర్ కాలేజీల్లో విద్యా క్యాలెండర్ మేరకు పరీక్షలు నిర్వహించాలని ఆర్‌ఐవో రాయల సత్యనారాయణ వెల్లడించారు. రెగ్యులర్ కోర్సుల వారికి ఈ నెల 18 వరకు, ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 17 వరకు పరీక్షలు జరపాలన్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి జారీ చేసిన ప్రశ్నా పత్రాలతోనే పరీక్షలు నిర్వహించాలన్నారు.

దసరాకు స్పెషల్ బస్సులు

500 పైనే..

- విజయవాడ, హైదరాబాద్‌లకు అధిక సర్వీసులు
- దసరాకు ముందు.. తర్వాత నడిపేలా సన్నాహాలు
- 19 నుంచి అందుబాటులోకి స్పెషల్ సర్వీసులు
- ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలే వసూలు



సాక్షి, విశాఖపట్నం: దసరాకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడపడానికి సన్నద్ధమవుతోంది. ఈ పండక్కి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం నడుస్తున్న రెగ్యులర్ సర్వీసులకు అదనంగా వీటిని నడపనుంది. ఆర్టీసీ విశాఖ రీజియన్ నుంచి ఈ దసరాకు 500కు పైగా బస్సులను అందుబాటులో ఉంచుతోంది. వీటిని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌కు పంపడానికి ప్రణాళిక రూపొందించింది. ఈ నెల 23న దసరా పండుగను జరుపుకుంటున్నారు. అంతకు ముందుగానే పలువురు తమ స్వస్థలాలకు పయనమవుతారు. ఏటా దసరాకు హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి విశాఖకు, ఉత్తరాంధ్ర జిల్లాలకు పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. అందువల్ల ఈ నెల 19, 20, 21, 22 తేదీల్లో హైదరాబాద్ నుంచి రోజుకు 20 బస్సులు, విజయవాడ నుంచి 10 బస్సులు చొప్పున నడపనున్నారు. ఇంకా విశాఖ నుంచి ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు వెళ్లే వారి కోసం కూడా 22, 23 తేదీల్లో 200 వరకు బస్సులను తిప్పనున్నారు. అలాగే దసరా అనంతరం ఉత్తరాంధ్ర, విశాఖల నుంచి రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్‌ల వైపు తిరుగు పయనమయ్యే ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని మరో 200 బస్సులకు పైగా ఆయా ప్రాంతాలకు పంపించనున్నారు. వీటిని ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు నడపనున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. మరోవైపు ప్రయాణికుల సౌకర్యార్థం ఇప్పటికే ఆర్టీసీ రిజర్వేషన్ సదుపాయాన్ని అందుబాటులో ఉంచింది. ముందస్తుగా కొంతమంది ఇప్పటికే రిజర్వేషన్ చేయించుకుంటున్నారు.

స్పెషల్స్‌లోనూ సాధారణ చార్జీలే..

సంక్రాంతి, దసరా వంటి పండగ రోజుల్లో పండగలకు సొంతూళ్లకు వెళ్లే వారికి సంఖ్య అధికంగా ఉంటుంది. ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా స్పెషల్స్ పేరిట ఆర్టీసీ అదనపు బస్సులు నడుపుతుంటుంది. ఈ స్పెషల్ బస్సుల్లో సాధారణ బస్సుల్లో టికెట్టు చార్జీకంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తుంది. ఉదాహరణకు రూ.100 సాధారణ టికెట్ చార్జీ ఉంటే రూ.150 చెల్లించాల్సి ఉంటుంది. ఈ స్పెషల్ బస్సుల్లో ఒకవైపే ప్రయాణికుల రద్దీ ఉండడం, రెండో వైపు ఖాళీగా రావాల్సి వస్తుండడంతో ఇలా అదనపు చార్జీలు వసూలు చేసేది. ఈ విధానం కొన్నేళ్లుగా ఆర్టీసీలో రివాజుగా వచ్చేది. దీంతో ప్రత్యేక బస్సుల్లో అదనపు బాదుడు బెంగ ప్రయాణికుల్లో ఉండేది. కానీ ఈ దసరాకు నడిపే ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించే వారికి ఆర్టీసీ శుభవార్త చెప్పింది. ఈ స్పెషల్ బస్సుల్లో మునుపటిలా అదనపు చార్జీలు వసూలు చేయడం లేదని తెలిపింది. అంటే ఈ ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ బస్సు చార్జీలే ఉంటాయన్న మాట! ఇది దసరా ప్రయాణికులకు ఊరట కలిగించనుంది.

ఇళ్ల నిర్మాణాల జోరు పెంచాలి

- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్
- సామూహిక గృహ ప్రవేశాల నేపథ్యంలో జిల్లాలోని లేఅవుట్ల సందర్శన

దొండపర్తి : ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ.1500 కోట్లు ఉన్నాయని, బిల్లుల చెల్లింపునకు ఎలాంటి ఇబ్బందీ లేదని, జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ అధికారులను, వివిధ కాంట్రాక్టు ఏజెన్సీల నిర్వాహకులను ఆదేశించారు. ఈ నెల 12న సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం నేపథ్యంలో ఆయన మంగళవారం జిల్లాలో పర్యటించారు. ముందుగా ఆనందపురం మండల పరిధిలోని గిడిజాల, తంగుడిబిల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లను సందర్శించారు. అనంతరం స్థానిక వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరినాలో ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావులతో కలిసి ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. అన్ని విభాగాల అధికారులూ సమన్వయంతో కృషి చేసి నిర్దేశిత గడువులోగా శతశాతం నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ క్రమంలో ఇప్పటివరకు జిల్లాలో జరిగిన పని వివరాలు, సాధించిన ప్రగతిని ఆరా తీశారు. డిసెంబర్ నెలాఖరుకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. సంబంధిత లేఅవుట్లలో ఇళ్లను జియో ట్యాగింగ్ ద్వారా అనుసంధానించాలని, లబ్ధిదారులందరికీ బ్యాంకు ఖాతాలు తెరవాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియను వారంలోగా పూర్తి చేయాలని తెలిపారు. లబ్ధిదారులను అన్ని విధాలుగా ప్రోత్సహించి నిర్మాణాలు పూర్తి చేయించేందుకు కృషి చేయాలని అధికారులకు చెప్పారు. ఒక వేళ ఎవరైనా లబ్ధిదారులు ఆసక్తి కనబరచకపోతే ఇంటి పట్టాను రద్దు చేయాలని స్పష్టం చేశారు.



ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్

మెటీరియల్స్ క్రమం తప్పకుండా సరఫరా

ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన మెటీరియల్‌ను క్రమం తప్పకుండా సరఫరా చేయాలని, బిల్లుల చెల్లింపులో జాప్యం చేయవద్దని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనా ఇళ్ల నిర్మాణాలు ఆగడానికి వీలులేదని, అది నిరంతరంగా కొనసాగాలని తేల్చి చెప్పారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకొని నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని చెప్పారు.

ఏజెన్సీ నిర్వాహకులు మరింత శ్రద్ధ వహించాలి

థర్డ్ ఆప్షన్‌లో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత ప్రగతి సాధించాలన్నారు. కాంట్రాక్టు ఏజెన్సీ నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్దేశిత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేసి ఇళ్లను సంబంధిత లబ్ధిదారులకు అప్పగించాలని చెప్పారు. ఏదైనా ఏజెన్సీ పనితీరు సరిగా లేనిపక్షంలో ఒప్పందాన్ని రద్దు చేసి మరో ఏజెన్సీకి అవకాశం ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ ఈ నెలాఖరు నాటికి గుర్తించిన సమస్యలను పరిష్కరించి మెరుగైన ఫలితాలు సాధిస్తామని పేర్కొన్నారు. ఇసుక తరలింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఏజెన్సీ నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ప్రత్యేక కూపన్లు అందజేస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జీవీఎంసీ ఈఈ రవికృష్ణ రాజు, గృహ నిర్మాణ శాఖ ఈఈ, డీఈలు, ఏఈలు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన జాయింట్ సబ్ రిజిస్ట్రార్



ఏసీబీకి చిక్కిన జాయింట్ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, డాక్యుమెంట్ రైటర్లు

జగదాంబ: లంచం తీసుకుంటూ టర్నర్ సత్రం జంక్షన్‌లోని జాయింట్ సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్లు ఏసీబీకి చిక్కారు. డీఎస్పీ శ్రావణి తెలిపిన వివరాలివీ.. తన బంధువు భూమికి సంబంధించి ఒరిజినల్ తనఖా దస్తావేజు(ఎంవోడీటీ)ని విడుదల చేయడం, సేల్ డీడ్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ పని కోసం దొండపర్తికి చెందిన వాగోలు గోపీకృష్ణ జాయింట్ సబ్ రిజిస్ట్రార్–2 కె.శ్రీనివాసులను సంప్రదించారు. ఈ పని పూర్తి చేయడానికి ఆయన రూ.15 వేలు డిమాండ్ చేశారు. దీంతో గోపీకృష్ణ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ శ్రావణి ఆధ్వర్యంలో సిబ్బంది వల పన్నారు. మంగళవారం అసిస్టెంట్ డాక్యుమెంట్ రైటర్ ఎస్.లక్ష్మి ద్వారా రూ.15వేలు లంచం తీసుకుంటుండగా.. అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌ను పట్టుకున్నారు. సబ్ రిజిస్ట్రార్‌కు సహకరించిన డాక్యుమెంట్ రైటర్ పి.వెంకటరావు, అసిస్టెంట్ రైటర్ ఎస్.లక్ష్మిలను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను బుధవారం ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు.

మత్స్యకారులకు సీఎం జగన్ పెద్దపీట

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



విజయచందర్‌ను అభినందిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

సాక్షి, విశాఖపట్నం: మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. నామినేటెడ్, చట్టసభల్లోనూ వారికి ఉన్నత స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పేర్ల విజయచందర్‌ను మంగళవారం లాసన్స్‌బేకాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపీ అభినందించి.. శాలువాతో సన్మానించారు. పేర్ల విజయచందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. మత్స్యకార సహకార సంఘాలను ఐక్యం చేస్తూ.. గ్రామ, మండల, జిల్లా కమిటీల నియామకం, బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమే మహాబలం

నేవీ చీఫ్ హరికుమార్



ఐఎన్‌ఎస్ కోర 25వ వార్షికోత్సవంలో పాల్గొన్న నౌకాదళ చీఫ్ హరికుమార్

ఏయూక్యాంపస్: మానసిక ఆరోగ్యమే మహాబలం అని భారత నౌకాదళ అధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ అన్నారు. తూర్పు నావికాదళం ఆతిథ్యంలో జరుగుతున్న స్టేషన్ కమాండర్స్ వర్క్‌షాప్‌లో రెండో రోజైన మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నౌకాదళ అధిపతి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంతో చాలా ఉపయోగాలు న్నాయని వివరించారు. రెండు రోజుల విశాఖ పర్యటనకు వచ్చిన అడ్మిరల్ ఆర్.హరికుమార్‌కు తూర్పు నావికాదళ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ స్వాగతం పలికి.. ప్రస్తుత ప్రాజెక్టుల గురించి వివరించారు. అనంతరం ఐఎన్‌ఎస్ కోర 25వ వార్షికోత్సవంలో నేవీ చీఫ్ పాల్గొన్నారు. నేవల్ డాక్‌యార్డ్‌లో ఎమర్జెన్సీ డీజిల్ జనరేటర్ సదుపాయాన్ని ప్రారంభించారు. నావికాదళ అధికారులు, సెయిలర్స్, జవాన్లతో బుధవారం నౌకాదళ అధిపతి సమావేశమవుతారు.

నువ్వా–నేనా..!

సందడిగా స్కూల్ గేమ్స్



బాక్సింగ్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న పాఠశాల స్థాయి అండర్–14, 17 జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి. మంగళవారం విశాఖ నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో అండర్–14 బాలుర కిక్ బాక్సింగ్ పోటీలను నిర్వహించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలకు చెందిన 138 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విద్యార్థుల వయస్సు ఆధారంగా పదకొండు గ్రూపులుగా విభజించి పోటీలను నిర్వహించారు. వీరిలో ప్రతిభ చూపిన ఒక్కో గ్రూపు నుంచి ఒక్కరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పోటీల న్యాయనిర్ణేతగా ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు వ్యవహరించారు. డీఈవో చంద్రకళ సూచనల మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టి.నాగేశ్వరరావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు సతీష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. క్రీడాకారులకు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.

రేపు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

- అప్పికొండ తీరంలో డీశాలినేషన్ ప్లాంట్
- భీమిలిలో ఘన వ్యర్థాల బయోమైనింగ్
- వీటితో పాటు 57 అంశాలపై చర్చ



డాబాగార్డెన్స్: నగరంలో పరిశ్రమల విస్తరణ, కొత్త పరిశ్రమల ఏర్పాటుతో నీటి అవసరాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పారిశ్రామిక అవసరాలకు సముద్ర నీటిని శుద్ధి(డీశాలినేషన్) చేసి వినియోగించుకోవాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జీవీఎంసీ ముందడుగు వేసింది. ఈ నెల 12న జరిగే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ముందుకు ఈ అంశం రానుంది. ప్లాంట్ ఏర్పాటు విషయమై ఇప్పటికే జీవీఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య పలుమార్లు సమీక్షలు జరిగాయి. ఈ మేరకు 100 ఎంఎల్‌డీ డీశాలినేషన్ ప్లాంట్‌ను పీపీపీ పద్ధతిలో ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్‌ను ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక, వాణిజ్య నిర్వహణ, చట్టపర లావాదేవీల సలహా కన్సల్టెంట్‌గా ప్రభుత్వం నియమించింది. వివిధ దశల్లో చర్చలు అనంతరం అప్పికొండ సముద్ర తీరం సమీపంలో సుమారు 25 ఎకరాల్లో 100 ఎంఎల్‌డీ డీ శాలినేషన్ ప్లాంట్ పీపీపీ పద్ధతిలో ఏర్పాటుకు గత జూన్‌లో ఒప్పందం జరిగింది. ఇక్కడ ప్లాంట్ ఏర్పాటుకు రూ.600 కోట్లు ఖర్చు అవుతుందని కన్సల్టెంట్ సంస్థ అంచనా వేసింది. మొదటిగా 50 ఎంఎల్‌డీ ప్లాంట్ ఏర్పాటు చేసి.. డిమాండ్ బట్టి రెండో విడతగా 50 ఎంఎల్‌డీ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఇందుకు సంబంధించి 100 ఎంఎల్‌డీ కెపాసిటీతో ఉప్పునీటి పైపులైన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆ సంస్థ శుద్ధి చేసిన నీటిని 80 శాతం వరకు 33 ఏళ్ల పాటు జీవీఎంసీ తీసుకుని వివిధ పరిశ్రమలకు సరఫరా చేయనుంది. ఇందుకు సంబంధించి కార్పొరేషన్ ముందస్తు అనుమతితో వివిధ డాక్యుమెంట్లను.. పరిశీలన, ఆమోదానికి ప్రభుత్వానికి పంపారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఈ నెల 12న జరిగే కౌన్సిల్ సమావేశంలో ఈ అంశంపై ప్రధానంగా చర్చించనున్నారు. అలాగే పలు అభివృద్ధి పనులకు సంబంధించి 57 అంశాలతో పాటు మరికొన్ని టేబుల్ అజెండా అంశాలు చర్చకు రానున్నాయి.

- భీమిలి డంపింగ్ యార్డ్‌లో ఆరు ఎకరాల్లోని ఘన వ్యర్థాలను బయో మైనింగ్ చేసేందుకు రూ.1.70 కోట్లతో పనులు నిర్వహించేందుకు మేయర్ జారీ చేసిన ముందస్తు పరిపాలనాపరమైన ఆమోద అంశం కౌన్సిల్ ముందుకు రానుంది.
- 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో రూ.69లక్షలతో బహుళ ప్రయోజన సామాజిక భవనం నిర్మాణం..
- 69వ వార్డు నాతయ్యపాలెంలో రూ.96.05 లక్షలతో క్రిస్టియన్ శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు..
- ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి బడ్జెట్ కేటాయింపుల అంశం.
- జోన్–1 పరిధి 4వ వార్డులో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- జోన్–2 పరిధి 11, 12 వార్డుల్లో అంబేడ్కర్ విగ్రహం నుంచి పెదగదిలి బీఆర్‌టీఎస్ రోడ్డు జంక్షన్ వరకు రూ.66 లక్షలతో సెంట్రల్ మీడియన్‌లో వీధి దీపాలు ఏర్పాటు, రూ.1.81 కోట్లతో ఆర్‌సీసీ కాలువ, కాలిబాట నిర్మాణం, రూ.1.75 కోట్లతో తారురోడ్డు వెడల్పు..
- జోన్–2 పరిధి 11వ వార్డు ఆరిలోవ దుర్గాలమ్మ గుడి వద్ద జీవీఎంసీ కల్యాణ మండపంలో రూ.1.95 కోట్లతో మూడో అంతస్తు నిర్మాణం..
- గాజువాక జోన్ 88వ వార్డు కొత్తూరు నుంచి వెదుళ్లనరవ వరకు బీటీ హాట్ మిక్స్‌రోడ్డు, కల్వర్టు నిర్మాణం, వార్డులో పలు ప్రాంతాల్లో బీటీ హాట్ మిక్స్ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం
- రూ.1.64 కోట్లతో దొండపర్తి కూడలి నుంచి మహారాణిపార్లర్ వరకు తారు రోడ్డు నిర్మాణం, రూ.1.85 కోట్లతో అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, దొండపర్తి రాజమండ్రి సిల్క్ మందిర్ నుంచి జాతీయ రహదారి వరకు వీధి దీపాలు, సెంట్రల్ మీడియన్ నిర్మాణం తదితర అంశాలను సభ్యులు చర్చించి ఆమోదించనున్నారు.

ముడుపులు తీసుకున్నట్టు నిరూపిస్తే రాజీనామా



మాట్లాడుతున్న కార్పొరేటర్ సాధిక్

కార్పొరేటర్ల సవాల్

డాబాగార్డెన్స్: బీచ్‌రోడ్డులో గానీ, నగరంలోని ఫుడ్ కోర్టులో గానీ దుకాణదారుల వద్ద ముడుపులు తీసుకున్నట్టు నిరూపిస్తే రాజీనామా చేస్తామని ఫుడ్ కోర్టు కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు మహ్మద్ సాధిక్, యు.నారాయణరావు, చెన్నా జానకీరామ్ సవాల్ విసిరారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు డబ్బులు తీసుకుని దుకాణాలు ఏర్పాటు చేయిస్తున్నారంటూ ఓ పత్రిక ప్రచురించిన కథనాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ చాంబర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఫుడ్ కోర్టు అంశంపై మేయర్ ఆదేశాల మేరకు డిప్యూటీ మేయర్ కె.సతీష్ చైర్మన్‌గా, పలువురు కార్పొరేటర్లతో కమిటీ ఏర్పాటైందన్నారు. ఇప్పటికే కమిటీ పలుమార్లు సమావేశమై.. తగిన నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. చర్చించిన అంశాలన్నీ మేయర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిజమైన చిరు వ్యాపారులకు దుకాణాలు అందేలా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఆయా దుకాణదారుల వద్ద కొన్ని యూనియన్లు దౌర్జన్యం చేస్తూ.. డబ్బులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. చిరు వ్యాపారులపై యూనియన్లు దౌర్జన్యంగా వ్యవహరిస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆధార్ అనుసంధానంతో ఒక కుటుంబానికి ఒక దుకాణం మాత్రమే ఇచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

వివాదాస్పద స్థలంలో విధ్వంసం



వివాదాస్పద స్థలంలో రేకుల ప్రహరీని తొలగిస్తున్న రౌడీ మూకలు



రేకుల కంటైనర్‌ను ధ్వంసం చేస్తున్న రౌడీ మూకలు

- అలజడి సృష్టించిన రౌడీమూకలు
- కేసు కోర్టులో ఉన్నా పట్టించుకోని భూఆక్రమణదారులు
- ముగ్గుర్ని అదుపులో తీసుకున్న పోలీసులు

కూర్మన్నపాలెం : కూర్మన్నపాలెం సర్వే నంబర్ 39/1సీలో 1.09 ఎకరాల స్థలం కొన్నేళ్లుగా ఖాళీ ఉంది. రెండేళ్లుగా ఆ స్థలంపై వివాదం నడుస్తోంది. ఇటీవల ఇదే స్థలంపై ఇరువర్గాలు దువ్వాడ పోలీసులను ఆశ్రయించారు. సివిల్ గొడవ కావడంతో కోర్టులో తేల్చుకోవాలని దువ్వాడ పోలీసులు ఇరు వర్గాలకు సూచించారు. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ఓ వర్గానికి చెందిన సుమారు 100 మంది వివాదాస్పద స్థలంలో చొరబడి రేకుల ప్రహరీని ధ్వంసం చేశారు. దీంతో వ్యతిరేక వర్గం దువ్వాడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దువ్వాడ సీఐ సంఘటన స్థలానికి చేరుకొని రౌడీ మూకలను చెదరగొట్టారు. ఇందులో ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. 1980లో సర్వే నంబర్ 39/1, 2లో 9.30 ఎకరాల స్థలాన్ని అత్తిలి నారాయణరావు నుంచి కొనుగోలు చేశామని అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన బద్దిరాజు మురళీరాజు తెలిపారు. అప్పట్లో ఎల్పీ నంబర్ 3.80 తీసుకొని లేఅవుట్ కూడా వేసి 54 మందికి స్థలాన్ని విక్రయించామన్నారు. తరువాత శ్రీలక్ష్మి గణేష్ బిల్డర్‌కు 2005లో డెవలప్‌మెంట్‌కు ఇచ్చారు. ఈ భూమి మధ్యన రైవాడ కెనాల్ భూసమీకరణ చేయడంతో సదరు సర్వే నంబర్ సబ్ డివిజన్‌గా మార్చారు. 39/1ఎ, 39/1బి, 39/1సీలుగా విభజించారు. ఇందులో 39/1ఏ సుమారు 6 ఎకరాల్లో ఓషన్ గ్రీన్ అపార్ట్‌మెంట్ నిర్మాణం జరిగింది. 39/1బీ రైవాడ కాలువలో పోయింది. మిగిలిన 39/1సీ 1.09 ఎకరాల స్థలం ఖాళీగా ఉండడంతో ఆక్రమణదారుల కన్ను పడింది. అత్తిలి నారాయణరావు వద్ద ఆయన తమ్ముడు పెదవెంకటరమణ, మంతా సుబ్రహ్మణ్యం, ముదునూరి శ్రీనివాసరాజులు స్థలం కొన్నట్టు దస్తావేజులు చూపుతున్నారు. ఇరువర్గాలు ఆ స్థలం తమదంటే తమదని తరచూ గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో స్థలాన్ని కొనుగోలు చేసినట్లు చెబుతున్న బుద్ద మురళీరాజు గాజువాక కోర్టును ఆశ్రయించారు. అయితే గతంలో మంతా సుబ్రహ్మణ్యం స్థలాన్ని చదును చేసి లే అవుట్‌గా మార్చి స్థలాన్ని విక్రయించేందుకు ప్రయత్నాలు చేసి, అక్కడ ఒక షెడ్డును కూడా నిర్మించడంతో మరో వర్గం జీవీఎంసీకి ఫిర్యాదు చేసింది. దీంతో జీవీఎంసీ అధికారులు వచ్చి షెడ్డును కూల్చివేశారు. దీంతో కక్ష పెట్టుకున్న మంతా సుబ్రహ్మణ్యం వర్గానికి చెందిన సుమారు వంద మంది మంగళవారం ఈ స్థలంలో చొరబడి రేకుల ప్రహరీని ధ్వంసం చేశారు. గాజువాక ఏసీపీ త్రినాథ్, దువ్వాడ సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. కృష్ణంరాజు, సుబ్రహ్మణ్యం, వంశీపై కేసు నమోదు చేశారు.

స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి కృష్ణంనాయుడు కుమార్ (61) ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రస్తుతం అతను నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్‌లో గత ఏడాది ఫిబ్రవరిలో రిటైర్ అయిన కుమార్ టౌన్‌షిప్‌లోని సెక్టార్–6 లోని 304 బి క్వార్టర్‌లో కుటుంబంతో నివసిస్తున్నారు. అతనికి ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నాయి. కుటుంబంలో కూడా డబ్బు విషయంలో గొడవలు జరుగుతున్నట్టు సమాచారం. మంగళవారం మధ్యాహ్నం విశాఖ విమల విద్యాలయం జంక్షన్ దగ్గర నుంచి మెడపై గాయంతో ఇంటికి వచ్చాడు. వెంటనే అతని భార్య కుమార్‌ను ఉక్కు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం నగరంలోని ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. కుమార్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

తీరంలో చేపలు మృత్యువాత


తీరానికి కొట్టుకుని వచ్చిన చేపలు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌లో మంగళవారం సాయంత్రం చేపలు పెద్ద ఎత్తున మృత్యువాత పడి తీరానికి కొట్టుకుని వచ్చాయి. సముద్రంలో కాలుష్యం పెరిగినప్పుడు ఇలా గుంపులుగా చేపలు మృత్యువాత పడుతుంటాయని మత్స్యకారులు తెలిపారు.



చిట్టి తల్లులకు రక్షణ

బాలికలకు జగనన్న ఇచ్చిన తోడు ఇవే

చైల్డ్‌లైన్ 1098	దిశ 112	వుమెన్ హెల్ప్‌లైన్ 181
ఏపీ పోలీసు 100	ఎమర్జెన్సీ 108	మెడికల్ హెల్ప్‌లైన్ 104

బడి నుంచి ఇంటికి వెళ్లే సమయంలో మార్గమధ్యలో కాపుకాసి, రోజూ పలుకరిస్తుంటే స్నేహం చేసింది. కొద్దిరోజులు గడిచిన తరువాత తన వక్రబుద్ధి చూపాడు ఆ ప్రబుద్ధుడు. స్నేహం పేరుతో చేష్టలు శృతిమించుతున్నాయని భావించిన విద్యార్థిని దిశ 112 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి, జరిగిన తతంగాన్ని వివరించింది. మరుసటి రోజు మహిళా పోలీసులు స్కూల్‌కు వెళ్లే దారిలో మాటు వేసి, ఆ ప్రబుద్ధుడికి గట్టిగానే బుద్ధి చెప్పారు. విశాఖ నగరంలోని బస్టాండ్ ప్రాంతంలో జరిగిన ఘటన ఇది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాలికలకు భరోసా కల్పించేలా చేసిన ఏర్పాట్లతో వారిలో చైతన్యం వచ్చిందనడానికి ఇదో నిదర్శనంగా నిలుస్తోంది.

ఇది గుడ్‌టచ్....ఏది బ్యాడ్ టచ్ అనేది తెలుసుకునేలా యుక్త వయసు బాలికల్లో అవగాహన కల్పించేలా పాఠశాల స్థాయిలోనే చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలు ఇస్తున్నాయి. బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో జిల్లా విద్య, స్త్రీ శిశు సంక్షేమ, పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 1,385 పాఠశాలలు, 173 జూనియర్ కాలేజీల్లో పోక్సో చట్టంపై అవగాహన కల్పించేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- లైంగిక వేధింపులకు అడ్డుకట్ట
- పాఠశాలల్లో 'భరోసా బాక్స్'
- గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన
- సమస్యల పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీ
- విద్యార్థినులకు 'జగనన్న తోడు'పై విస్తృత ప్రచారం
- నేడు అంతర్జాతీయ బాలిక దినోత్సవం





టోల్ ఫ్రీ నంబర్లతో ముద్రించిన పోస్టర్లు

విశాఖ విద్య: ప్రతీ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో హెచ్‌ఎం గదికి సమీపంలో అందరికీ కనిపించేలా బాలికల కోసమని ప్రత్యేకంగా 'భరోసా బాక్స్' ఏర్పాటు చేశారు. బాక్స్‌కు తాళం వేసి, దానిని ప్రతీ పదిహేను రోజులకోకసారి ఎంఈవో పర్యవేక్షణలోని కమిటీ సభ్యులైన మహిళా పోలీసు, వైద్యారోగ్యశాఖ ఏఎన్‌ఎం సమక్షంలో తెరుస్తున్నారు. ఏమైనా ఫిర్యాదులు లేదా సూచనలు, సలహాలు ఉంటే, వాటిని వేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచి, పరిష్కారం కోసం సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

ఇదిగో బాలికా వికాసం

ఆడపిల్ల అంటే గర్భంలోనే చిదిమేసే వారు ఒకప్పుడు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం బాలికా సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలతో బాలికా వికాసం విరాజిల్లుతోంది. జిల్లాలో ఇంటర్మీయెట్ చదివే వారిలో బాలురు 42,037 మంది ఉంటే, బాలికలు 37,041 మంది ఉన్నారు. 1 నుంచి 10వ తరగతి చూసినట్టయితే అబ్బాయిలు 1,84,295 మంది కాగా, అమ్మాయిలు 1,65,465 మంది ఉన్నారు. 3 నుంచి 6 ఏళ్ల వయస్సులో అబ్బాయిలు 25,740 మంది కాగా, అమ్మాయిలు 25,036 మంది ఉన్నారు. అదే 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు మధ్య వారిలో అబ్బాయిలు 16,715 మంది కాగా, అమ్మాయిలు 16,621 మంది ఉన్నారు. ఈ లెక్కన గతంలో కన్నా క్రమేపీ అమ్మాయిల సంఖ్య పెరుగుతోందని ఈ గణాంకాలు చెబుతున్నాయి.

పటిష్టమైన చర్యలు



జిల్లాలోని అన్ని పాఠశాలల్లో భరోసా బాక్స్‌లను ఏర్పాటు చేశాం. కౌమార విద్యపై ఓ మహిళా ఉపాధ్యాయురాలికి బాధ్యత అప్పగించాం. విద్యా క్యాలెండర్‌లో కూడా బాలికా సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ఆ దిశగానే తగిన చర్యలు తీసుకుంటున్నాం. – ఎల్.చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

బాల్య వివాహాలు తగ్గాయి



బాలికా విద్య ప్రాధాన్యతపై అంగన్‌వాడీల స్థాయిలోనే తగిన అవగాహన కల్పించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చనేది తెలియజేస్తున్నాం. గతంలో కన్నా బాల్య వివాహాలు బాగా తగ్గాయి. వీటిపై మరింత అవగాహన కల్పిస్తున్నాం.
– డి.వెంకటేశ్వరి, స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్, విశాఖ జిల్లా

లైగింపు వేధింపులు సహించేది లేదు



విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు తేలితే అలాంటి వారిని కఠినంగా శిక్ష విధించేలా చట్టాలు ఉన్నాయి. వీటిపై పాఠశాలలు, కాలేజీల స్థాయిలో విస్తృత చర్చ జరగాలి. ఉపాధ్యాయులతో పాటు, తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలి. – ఎంఆర్ఎల్. రాధ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్ పర్సన్

బాలికలకు రక్షణగా నిలుస్తాం



బాలికలకు భరోసాగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయం. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే ఉపేక్షించబోం. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో భరోసా బాక్స్‌ను ఏర్పాటు చేయాలి. అత్యవసర ఫోన్ నంబర్లు గోడలపై రాయించాలి.
–డాక్టర్ జి. సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు, విశాఖ

మానసిక రోగులకు సేవలు విస్తృతం చేయాలి



ర్యాలీలో పాల్గొన్న వైద్య విద్యార్థులు

ఏయూక్యాంపస్: మానసిక రోగులకు సేవలు విస్తృతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ పిలుపునిచ్చారు. ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవంలో ఆమె మాట్లాడారు. మానసిక రోగుల హక్కులు, చట్టాలను వివరించారు. ఏఎంసీ మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ డి.విజయలక్ష్మి, విశాఖ మానసిక వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.సురేష్ కుమార్, ప్రొఫెసర్ డాక్టర్ కె.ఎస్.రెడ్డి, కార్యదర్శి డాక్టర్ మాధవీలత, సీఐలు కె.రామారావు, ఎస్.విజయ కుమార్ తదితరులు ప్రసంగించారు. ఈ ఏడాది మానసిక ఆరోగ్యం–ఒక సార్వత్రిక మానవ హక్కు అనే నినాదంతో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన పీజీ, నర్సింగ్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం బీచ్‌రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్ మాబ్, లఘు నాటికలు చైతన్యాన్ని నింపాయి. న్యూఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవంలో ఆస్పత్రి తరఫున సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామరెడ్డి హాజరయ్యారు.

గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: షాలిమార్‌లో బుధవారం బయల్దేరవలసిన షాలిమర్- నాగర్‌కోయల్ (12660) గురుదేవ్ ఎక్స్‌ప్రెస్‌ను పెయిరింగ్ రైలు ఆలస్యం కారణంగా రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 10.15 గంటలకు బెంగళూరులో బయల్దేరవలసిన బెంగళూరు–అగర్తలా (12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ సుమారు 10 గంటలు ఆలస్యంగా రాత్రి 8 గంటలకు బయల్దేరింది.

కేకే లైన్ రెడీ

మంగళవారం నుంచి రాకపోకలు సాగిస్తున్న గూడ్స్ రైళ్లు



ప్రయాణిస్తున్న గూడ్స్ రైలు

తాటిచెట్లపాలెం: కొత్తవలస–కిరండూల్ (కె.కె.లైన్) సిద్ధమైంది. కోరాపుట్ – జగదల్‌పూర్ సెక్షన్ మనబార్–జరాటి స్టేషన్ పరిధిలో గత నెల 24న భారీ కొండ చరియలు విరిగిపడిన విషయం తెలిసిందే. ఈ కారణంగా ఈ మార్గంలో అప్పటి నుంచి రైళ్ల రాకపోకలు నిలిపివేసి పునరుద్ధరణ పనులు చేపట్టారు. వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మంగళవారం ఈ లైన్‌లో పర్యటించి ట్రాక్ పునరుద్ధరణను దగ్గరుండి పర్యవేక్షించారు. ఘటన జరిగిన తర్వాత ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ పలుమార్లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో సుమారు 10 వేల క్యూబిక్ మీటర్ల మట్టి (భారీ చెట్లు, బండరాళ్లతో) ట్రాక్‌పై పడ్డాయి. చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాస్, ఇద్దరు చీఫ్ ఇంజినీర్లలో కలిసి సుమారు 450 మంది కార్మికులు, భారీ యంత్రాలతో పనులు పూర్తి చేయించారు. రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్, లక్నో, ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు పునరుద్ధరణ చర్యల్లో పాల్గొన్నారు. ఈ మేరకు మంగళవారం నుంచి ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు అనుమతులిచ్చారు. జగదల్‌పూర్–కిరండూల్‌లో లోడింగ్ పూర్తయిన తర్వాత వైజాగ్ స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, జిందాల్ స్టీల్, ఆర్సెలర్ మిట్టల్, వెల్‌స్పన్ వంటి కంపెనీలకు సుమారు 12 గూడ్స్ రైళ్లను పంపించారు. నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి సరకును తీసుకువచ్చేందుకు ఆరు ఖాళీ గూడ్స్ రేక్‌లను బచేలి, కిరండూల్‌లకు పంపించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌కు తొలగిన ఆటంకాలు

ఉక్కునగరం: కేకే లైనులో ఏర్పడిన అవాంతరాల వల్ల ఐరన్ ఓర్ సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్న స్టీల్‌ప్లాంట్‌కు శుభవార్త. కేకే లైను నుంచి ఐరన్ ఓర్ సరఫరా పునఃప్రారంభమైంది. ఎన్ఎండీసీకు చెందిన బైలదిల్లా గనుల నుంచి ఐరన్ ఓర్ సరఫరా నిలిచిపోయింది. మరోవైపు ప్లాంట్‌లో ఐరన్ ఓర్ నిల్వలు కనిష్ట స్థాయికి చేరుకోవడంతో నడుస్తున్న రెండు బ్లాస్ట్‌ఫర్నేసుల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రైల్వేశాఖ నిరంతర ప్రయత్నాల వల్ల కేకే లైన్ మంగళవారం పునరుద్ధరించడంతో స్టీల్‌ప్లాంట్‌కు ఐరన్ ఓర్ సరఫరాకు ఆటంకాలు తొలగిపోయాయి.

హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి


సింహాచలం (ఫైల్)

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ కాంట్రాక్ట్ కార్మికుడు సొమ్మసిల్లి పడిపోయి మృతి చెందాడు. మృతికి గుండెపోటు కారణమని చెబుతున్నారు. వివరాలివీ. 58వ వార్డు కోరమాండల్‌కు పక్కన గల ఉప్పరకాలనీలో గుర్రం సింహాచలం(43), భార్య వెంకటలక్ష్మి, కుమారుడు రాజేష్, కుమార్తె లావణ్యలతో కలిసి నివాసం ఉంటున్నాడు. హెచ్‌పీసీఎల్‌లో సబ్ కాంట్రాక్టర్ మనోజ్ ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థ వద్ద సివిల్ పనులు(కాంట్రాక్ట్ కార్మికుడు) చేస్తున్నాడు. మంగళవారం విధులకు వెళ్లిన సింహాచలం బి–బ్లాక్ వద్ద గోతులను తవ్వుతున్నాడు. ఒక్కసారిగి ఎగఊపిరితో అస్వస్థతకు గురయ్యాడు. సింహాచలం పరిస్థితి గుర్తించి తోటి కార్మికులు వెంటనే సంస్థకు చెందిన ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించటంతో ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించగా అప్పటికే సింహాచలం మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మల్కాపురం సీఐటీయూ నాయకులు మృతుడు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంట్రాక్టర్ మనోజ్‌తో పరిహారం కోసం చర్చలు జరిపారు. మృతుడు కుటుంబానికి రూ.9 లక్షలు, దహన ఖర్చులకు కొంత నగదు ఇస్తానని మనోజ్ హామీ ఇచ్చారు.

తీరంలో యువతి నరకయాతన

- రాళ్ల గుట్టల మధ్య 12 గంటల పాటు అవస్థ
- స్థానికుల సాయంతో ఒడ్డుకు చేర్చిన గజఈతగాళ్లు
- యువతితో వచ్చిన యువకుడి పరారీ
- కృష్ణా జిల్లాలో కిడ్నాప్ కేసు నమోదు


అప్పికొండ తీరంలో గాయాలతో కావ్యప్రియ

కూర్మన్నపాలెం: అప్పికొండ సాగర తీరంలో ఓ యువతి రాళ్ల గుట్టల మధ్య చిక్కుకొని 12 గంటల పాటు నరకయాతన అనుభవించింది. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రాంతానికి చెందిన డి.కావ్యప్రియ (18), భీమవరం ప్రాంతానికి చెందిన ఫణీంద్ర అనే యువకుడితో కలిసి ఈ నెల 2వ తేదీ నుంచి అప్పికొండ శివాలయ పరిసర ప్రాంతంలో ఉంటుంది. ఆదివారం సాయంత్రం తీరం వద్ద రాళ్ల గుట్టలపై ఆమె ఫొటో తీసుకుంటుండగా, ఎత్తు ప్రదేశం నుంచి జారి పడి రాళ్ల గుట్టల మధ్య ఉండిపోయింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను వదిలేసి యువకుడు పరారయ్యాడు. చిమ్మ చీకటి, జనసంచారం లేని ప్రదేశంలో రాత్రంతా మృత్యువుతో పోరాడిన ఆమెను సోమవారం ఉదయం బీచ్‌కు వచ్చిన కొందరు వ్యక్తులు గుర్తించి గజఈతగాళ్ల సాయంతో ఒడ్డుకు చేర్చారు. యువతి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. కాలు జారి పడిపోయానని, పరారీలో ఉన్న యువకుడిని ఏమీ అనవద్దని ఆమె ప్రాథేయపడింది. యువతి తల్లికి అంబులెన్స్ సిబ్బంది సమాచారమివ్వగా, తాము విశాఖ వస్తున్నామని చెప్పారు. తమ కుమార్తె కనిపించడంలేదని యలమకుదురు పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు యువతి తల్లి చెప్పింది. కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు బందరు పీఎస్ నుంచి అంబులెన్స్ సిబ్బందికి సమాచారం వచ్చింది. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న గాజువాక ఏసీపీ త్రినాథ్, దువ్వాడ సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కేజీహెచ్‌కు చేరుకొని యువతి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదవశాత్తు కాలుజారి పడిందా... లేదా మరే ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వ విద్యాలయాలకు దిక్సూచిగా ఏయూ

- ఎన్ఐఆర్ఎఫ్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపడం పట్ల హర్షం
- నాలుగు విభాగాల్లో ఏయూకు పురస్కారాలు


మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి జ్ఞాపిక స్వీకరిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: రాష్ట్రంలో ఉన్నత విద్యకు దిక్సూచిగా, విద్యా రంగానికి మార్గదర్శిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలుస్తోందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయవాడలో మంగళవారం ఉన్నత విద్యాశాఖ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో కేంద్ర విద్యా శాఖ ప్రకటించే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో రాష్ట్రంలో ఏయూ నాలుగు విభాగాల్లో అత్యుత్తమ స్థానాల్లో నిలవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఓవరాల్ విభాగంలో ఏయూ, కళాశాలల విభాగంలో ఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలలు, స్టార్టప్ ఇంక్యుబేషన్ రంగాల్లో ఆ హబ్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ.. నాలుగు జ్ఞాపికలను అందజేశారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఈ జ్ఞాపికలను స్వీకరించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.